దివినుండి భువికి



1967 అక్టోబరు 30—

గోడమీద మేకుకు వేలాడుతున్న కాలెండరు తారీఖు చూపిస్తున్నది.

ఏడు గంటలు—

గోడగడియారం కాలాన్ని నిర్ణయిస్తున్నది.

సంధ్య రేడియో ట్యూన్ చేసింది.

"ఆలిండియా రేడియో వార్తలు. చదువుతున్నది . 1962 లో విశ్వాంతరాళంలోకి ప్రథమంగా ఎగిరిన శాస్త్రజ్ఞుల జట్టు హిందూదేశపు కాలమానంప్రకారం ఇవ్వాళ ఉదయం ఎనిమిది గంటలకు మాస్కో చేరుతుందని మాస్కో రేడియో నేడు ప్రకటించింది. ఈ జట్టు అంతరిక్షంలో తిరుగుతూ మొదట ఒక సంవత్సరంపాటు సంకేతాలు పంపుతూనే ఉన్నది. ఆతర్వాత అది కన్పించటమేకాని సంకేతాలు పంపించకపోవటంతో ఉపగ్రహంలోని శాస్త్రజ్ఞుల సజీవత్వం అనుమానించబడింది. కాని నేడు ఆ శాస్త్రజ్ఞులే అందుకు కారణం వివరించారు. వారి రేడియోలు, టెలివిజన్లు, ట్రాన్స్మిటర్లు, ఆఖరుకు ఉపగ్రహాన్ని నడిపే ఇంజనూ అన్నీ ఉన్నట్టుండి ఒక్కసారి పనిచేయటం మానేశాయిట. ఆ చెడిపోయిన వాటి నన్నింటినీ నేటికి వారు బాగుచేయ కలిగినట్లు, భూమిమీదికి దిగివస్తున్నట్లు వార్తలు అందించారు. ఈ వార్త విని మాస్కో శాస్త్రజ్ఞులూ, ప్రజలూ ఆశ్చర్యానందాలతో వారి రాకకై ఎదురు చూస్తున్నారు.. "

ఈ వార్త విన్న సంధ్య కుప్పలా కూలిపోయింది. ఆమె హృదయం వేయి వ్రక్కలయింది.

కొండముది హనుమంతరావు

గతం రేవులో కాలుజారి కాలప్రవాహంలో పడి కొట్టుకుపోతున్న సంధ్యను గత కాలపు సంఘటనలూ, సంస్కృతులూ జలగల్లా పట్టుకుని బాధించటం మొదలు పెట్టినయ్ ..

*   *   *

అపుడు తనకు పదిహేనవ సంవత్సరం; బావకు పద్దెనిమిదవ సంవత్సరం. తను ఇంటర్ సీనియర్ క్లాసు చదువుతున్నది; బావ ఫిజిక్సానర్స్ ఫైనలియర్ చదువుతున్నాడు.

ఆ సంవత్సరంలో అక్టోబరు 5 వ తేదీన- అంటే ఇప్పటికి పదేళ్ళక్రితం అన్నమాట- రష్యా శాస్త్రజ్ఞులు మొదటిసారిగా ఉపగ్రహాన్ని విజయవంతంగా ఆకాశంలోకి పంపించగల్గారు.

ఈ వార్తను రేడియో వెంటనే ప్రకటించింది; పత్రికలు పతాక శీర్షికలతో విపులంగా వివరించినయ్, ఏ పేపర్లో చూసినా ఆ ఉపగ్రహం తాలూకు వివరాలే.

అది 23 అంగుళాల వ్యాసంకల్గినగోళము. దాని బరువు 183 పౌనులు. మూడు అంచెల రాకెట్ల ద్వారా దానిని అంతరిక్షంలోకి విసిరివేశారు. సెకనుకు ఐదుమైళ్ళ వేగంతో భూమికి 560 మైళ్ల ఎత్తున అది భూమిచుట్టూ తిరుగుతున్నది భూమిని ఒకసారి చుట్టిరావటానికి 95 నిమిషాలు పట్టున్నది.

సరే అదంతా బాగానే ఉంది. కాని అసలు అది ఆకాశంలో క్రింద పడకుండా ఎలా నిలవకల్గుతున్నది? - అనే సందేహం కల్గింది. భూమికి ఆకర్షణశక్తి ఉందని పైనుంచి ఏదయినా వస్తువు క్రింద బడటానికి కారణం ఆశక్తేనని-తను ఫిజిక్స్‌లో చదువుతుంది. మరి.. ?

బావ నడిగింది

బావ నవ్వాడు తన అమాయకతకు కాబోలు! తన తెలివితక్కువ సందేహాన్ని చూసి కాబోలు బావ నవ్వాడు. నవ్వి సందేహ నివృత్తి చేశాడు.

చివరి రాకెట్ కొంత ఆర్బిటల్ వెలాసిటీతో ఉపగ్రహాన్ని విసిరింది. ఉపగ్రహం తాలూకు సెంట్రిఫ్యూగల్ ఫోర్స్ భూమ్యాకర్షణ శక్తిని బాలన్స్ చేస్తున్నది ఆ రెండు శక్తులూ బాలన్స్ అవుతున్నంతకాలం ఉపగ్రహం క్రిందకు పడదు

అయితే - ఎంతకాలం అది అలా అంతరిక్షంలో ప్రదక్షిణం చేస్తూ ఉంటుంది?- అనేది రెండో సందేహం

అదిరష్యాశాస్త్రజ్ఞులే చెప్పలేకపోయారు. ఉపగ్రహం తాలూకు వేగం గాలిలోని ఘనపదార్థాల అవరోధాలవల్ల కొన్నాళ్ళకు తగ్గుతుందని' అలా క్రమక్రమంగా తగుతూ క్రిందికి దిగుతూ వాతావరణపు దళసరి పొరల చేరి, పొరల రాపిడికి ఉష్ణము జనిస్తుందని ఆ ఉష్ణానికి అది కాలి రాలిపోతుందని చెప్పారు.

(కాని కాలము దాని ఆయుర్దాయాన్ని నిర్ణయం చేసింది)

ఇది రష్యా శాస్త్రజ్ఞుల సాంకేతిక విజ్ఞానాన్ని నిరూపిస్తున్నది - అని బావ అంటే ఉపగ్రహం నిర్మించగానే కాదు "ఆత్మ నిగ్రహం" సాధించాలిగాని, లేకపోతే మనిషికి ముక్తి ఎక్కడ-అని తాతయ్య పెదవి విరిచేవాడు!

తర్వాత తర్వాత కోతుల్ని, చిన్న చిన్న జంతువుల్ని పంపించారు వాటితోపాటే టెలీ-ఫోటో కెమెరాలు టెలివిజనూ, రేడియో ట్రాన్స్మిటర్లూ ఉపగ్రహంలో ఉంచారు. జంతువులు బ్రతికినయ్.

ఒక్కొక ఏడాది గడుస్తున్న కొద్దీ ఒక్కొక్క మెట్టే అధిరోహిస్తున్నారు శాస్త్రజ్ఞులు.

తను ఇంటర్ ప్యాసయింది; బావ ఫస్ట్ క్లాస్‌లో ఆనర్స్ ప్యాసయాడు.

అమ్మా-నాన్నా [illegible] పెళ్ళిమాట ఎత్తారు

"తొందరేమొచ్చింది మామయ్యా! రిసెర్చి చేయాలని ఉంది నాకు సంధ్యను కూడా ఆనర్స్‌లో చేర్పిస్తే సరి!"

బావ మాటను కాదనలేకపోయారు అమ్మా-నాన్నా

తను ఆనర్స్‌లో చేరింది; బావ రిసెర్చి చేస్తున్నాడు

నాలుగేళ్ళు ఇట్టే గడిచిపోయినయ్.

రష్యా శాస్త్రజ్ఞులు అంతరిక్షంలోకి మనుష్యుల్ని పంపించే శాస్త్రవిజ్ఞానాన్ని సాధించగలారు

తను ఎమ్ ఎస్‌సి. డిగ్రీ పొందటం, బావ కాస్మిక్ రేస్‌లో రిసెర్చిచేసి డాక్టరేట్ సంపాదించటం-ఒక్క సంవత్సరంలో జరిగినయ్.

"ఇరవయ్యేడు కూడా వచ్చింది...ఇంకెప్పుడండీ అమ్మాయి పెళ్లి చేయటం?"

అమ్మ నాన్నను హెచ్చరించింది.

మంచిరోజు చూసి నాన్న మామయ్యని అడిగాడు బావఇష్టం అన్నాడు మామయ్య. బావ అంగీకారం చూపించాడు. 'తథాస్తు' అన్నారు పెద్దలు. తాంబూలాలు పుచ్చుకున్నారు.

తనమనసు దివ్యలోకాలకు పయనించింది; తన హృదయం నవ్యానుభూతి పొందింది; తన శరీరం మధురభావంతో పులకరించింది.

ఆ సాయంత్రం—సముద్రతీరంలో...

బావా తనూ కూర్చుని.. ఎన్నో కబుర్లు .. ఏవేవో ఆలోచనలు.. భావిజీవితపు ఊహలు...

చీకటి పడేవేళకు ఇంటికి వచ్చేసరికి ఇండియాప్రభుత్వం పంపించిన ఆహ్వానం—

రష్యాప్రభుత్వం అయిదుగురు శాస్త్రజ్ఞులని మొదటిసారిగా విశ్వాంతరాళంలోకి పంపించటానికి నిర్ణయించింది నెహ్రూ గారిమీద గౌరవంతోనూ, హిందూదేశం మీదగల అభిమానంతోనూ భారతీయ శాస్త్రజ్ఞుడిని ఒకరిని పంపించటానికి అవకాశం కల్పిస్తున్నది రష్యాప్రభుత్వం. కాస్మిక్ రేస్‌లో అత్యద్భుతమైన పరిశోధన కావించిన భాస్కరాన్ని ఇండియాప్రభుత్వం ఆ అవకాశాన్ని ఉపయోగించుకోమని ఆహ్వానిస్తున్నది

భాస్కరం బావ సంతోషానికి అంతు లేదు ఆనాడు

అమ్మా నాన్నల విచారం ఇంతని చెప్పలేము

అత్తయ్యా మామయ్యా ఎంత విచారించారో ఆ పరమాత్ముడికే ఎఱుక.

తనకూ భయంగానే ఉంది—ప్రథమ ప్రయత్నం గాలీ, నీరూ, ఆహారమూ తమతోపాటే తీసికెళ్తారుట అయినా మటుకు మనం అనుకున్నట్లు అన్నీ జరుగుతాయని నమ్మకమేమిటి—అని అనిపించినా ఒక పక్కన సంతోషంగానే ఉంది. మొదటిసారిగా అంతరిక్షంలోకి ఎగరబోతున్న అయిగురు శాస్త్రజ్ఞులలో భాస్కరం బావ ఒకడు!

కాని—

అమ్మా-నాన్నా వద్దని చెప్పి చూశారు. అత్తయ్యా, మామయ్యా 'వద్దు వద్దు' అని బ్రతిమిలాడారు బావ వారిమాట వినలేదు. తనని చెప్పిచూడమన్నారు అమ్మా నాన్నా. తనేం చెప్తుంది? మానుకోమని ఎలా చెప్పగలదు??

ప్రపంచం ఇస్తున్న గౌరవమూ, గొప్పతనమూ ముందు తనలాంటి సామాన్యస్త్రీ అర్పించే ప్రేమా అభిమానాలు ఎంత? స్వతహాగా బావ ఎడ్వంచరస్ స్పిరిట్ కలవాడు అంతేకాక తను చేయదలచుకున్నది చేసి తీరుతాడు. తనూ అంతే! తనకీ అలాంటి అవకాశం లభించాక గాని ..

పక్కకి పిలిచి అత్తయ్య అన్నది

"అమ్మాయ్ సంధ్యా! నువ్వుచెప్పమ్మా. నీమాట కాదనడు వాడు"

చేతులు పట్టుకుని "ఇవి చేతులు కావు కాళ్ళనుకో" మన్నది అత్తయ్య. తనేమీ మాట్లాడలేకపోయింది. అత్తయ్య మొహం చూస్తే జాలికలుగుతున్నది. ఆమె కళ్ళు నీటి కుండలయినయ్.

"నాకు పుత్రభిక్ష పెట్టమ్మా!"

అత్తయ్యకు బావ ఒక్కడే కొడుకు. కూతుళ్లుకూడా లేరు.

"అత్తయ్యా! .."

"నువ్వు మావంశాన్ని నిలబెట్టాలమ్మా. చచ్చి నీకడుపున పుట్టాను"

అత్తయ్యమాట కాదనలేకపోయింది. గదిలోకి పోయిచూస్తే అప్పుడే బట్టలు సర్దుకుంటున్నాడు బావ

"బావా!"

ఏమిటా అన్నట్లుగా వెనకకి తిరిగి చూశాడు బావ.

తీరా బావ మొహంలోని ఉత్సాహం, సంతోషం చూస్తుంటే అత్తయ్య చెప్పమన్నది, చెప్పటానికి నోరు రాలేదు. కాని బావ గ్రహించాడు - తన మనసులోని విషయం.

అధైర్యపడవద్దు

శాస్త్రీయమైన, నిజమైన SEX—ADVICE పొందవచ్చును. మీకు ఉంటుకొన్న లక్షణములు వ్రాయుచూ, యింకా వివరాలకు కవరు పంపేది.

డాక్టర్ రత్నంసన్స్, (Estd 1904)
మలకపేట బిల్డింగ్స్, హైద్రాబాద్ - 2.
(దక్కన్)

అన్ని వ్యాధులకు

నరముల బలహీనత, తలదిమ్ము, మలబద్ధమునకు, చెడురక్తము మొదలైన వ్యాధులకు

ఆతంక నిగ్రహ మాత్రలనే వాడుడు

మంచిగుణము నిచ్చేమందు 82 మాత్రలు గల డబ్బీ వెల 1/4

ఆతంక నిగ్రహ ఫార్మసీ.
26, బ్రాడ్వే, మద్రాసు.

★ దివినుండి భువికి ★

"ఎందుకు సంధ్యా! చదువుకున్న దానివి అన్నీ తెలిసిన దానివి. నువ్వే అలా బెంబేలు పడిపోతావేం?"

తన కోసమూ బావనర్థిస్తున్నది; అత్తయ్య బాధ చూడలేక గాని.

"సంతోషంగా సాగనంపు సంధ్యా! బాలచంద్రుడిని చూడూ!-మాంచాల ఎంత ధైర్యంగా సంతోషంగా పంపిందో?"

బావ మాటలు వినేసరికి తనలో ఏదో ఒక విధమైన ధైర్యమూ, స్థైర్యమూ వచ్చినయ్. అత్తయ్య కంటతడిగాని, గదద కంఠం గాని తనని బలహీన పఱచలేక పోయినయ్-ఇక.

"లేదు బావా! శుభంగాపోయి లాభంగా రా!"

"అది అట్లా ఉండాలి. ఏదీ నవ్వు"

తను నవ్వింది-హృదయ పూర్వకంగా. బావ శ్రుతికల్పాడు.

"ఎంతచెప్పు. ఒక్క ఏడాది అంటే ఏడాది. ఏడాది ఎంతలో వస్తుంది. గిర్రున తిరిగిరాదూ-మనం చూస్తూ ఉండగానే"

బావ తనకు చెప్పిన ధైర్యపుమాటలే తను అమ్మ - నాన్నకూ, అత్తయ్యా మామయ్యకూ చెప్పింది.

తను ఇంతమందికీ ధైర్యం చెప్పిందేకాని, తీరా బావ విమానం ఎక్కుతుంటే తనకళ్ళు కన్నీటి కుండలయినయ్ ఎక్కి చేయి ఊపుతుంటే తనగుండెలు బరువెక్కినయ్

బావవెళ్ళిన నాల్గోరోజుకి రేడియోలో చెప్పారు రష్యాప్రభుత్వం ప్రథమంగా శాస్త్రజ్ఞులని ఆకాశంలోకి విజయవంతంగా పంపించగల్గిందీ అని.

తి విజయం తనకే ననిపించింది.

ఏడాదిపాటు అది కన్పిస్తూనే ఉన్నది, శాస్త్రజ్ఞులు పంపించే సంకేతాలు వినిపిస్తూనే ఉన్నయ్. కాని ఒకరోజున విన్పించలేదు. అమెరికా రేడియో ఆ ఉపగ్రహంలోని శాస్త్రజ్ఞులు బహుశా చనిపోయి ఉంటారని అందుకనే విన్పించటం లేదని అన్నారు. "కాదు రేడియో ట్రాన్స్మిటరు పనిచేయటం మానేసి ఉంటయ్" అని వ్యాఖ్యానించింది మాస్కో రేడియో. "ట్రాన్స్మిటర్లు చెడిపోతే శాస్త్రజ్ఞులు ఆ మాత్రం బాగు చేసుకోలేరా?" అని ఎదురుప్రశ్న వేసింది అమెరికా రేడియో!

దానికి తగ్గట్టుగానే ఏడాదిలో తిరిగి రావాలని పథకం వేసుకువెళ్ళినవారు ఏడ్నర్థమయినా తిరిగిరాలేదు

గదిలో తలుపులు బిగించుకుని ఒంటరిగా ఎన్నిసార్లు ఏడ్చిందో...ఎంతమంది దేవుళ్ళను ఎంతగా బ్రతిమిలాడుకుందో. .

రష్యా శాస్త్రజ్ఞులు మళ్ళీ జంతువులని పంపించడం మొదలుపెట్టారు.

తన హృదయం దహించుకుపోతున్నది. పగలు ఏపనీ చేయడానికి తోచదు రాత్రిళ్లు నిద్రపట్టదు. మంచంమీదనుంచిలేచి పెరట్లోకి పోతుంది తనతోపాటే అమ్మకూడా లేస్తుంది.

"మంచులో తిరగటం మంచిదికాదమ్మా! వచ్చి పడుకో!"

ఇంట్లోకివచ్చి పడుకుంటుంది కాని నిద్రపట్టేగా!

రోజుకు పదిపేపర్లు చూస్తుంది; రోజుకు ఆరుసార్లు రేడియోవార్తలు వింటుంది కాని ఒక్కపేపరూ రాయదు; ఒక్కసారయినా రేడియో చెప్పదు—బావ వస్తున్నట్లు కాక పోయినా బ్రతికిఉన్నట్లయినా.

రోజు యుగంగా గడుస్తున్నది .

రాధ పెళ్ళి నిశ్చయమైనట్లు బాబాయిదగ్గఱనుండి ఉత్తరం వచ్చినరోజున మాటల సందర్భంలో నాన్న అన్నాడు

"ఇంకా వాడికోసం ఎన్నాళ్ళని కనిపెట్టుకు కూర్చుంటాం! నామాటవిను తల్లీ!"

ఆ మాట వినగానే తనగుండె చెఱువై పోయింది

"కాదు నాన్నా! బావ వస్తాడు ఉపగ్రహం కన్పిస్తూనే ఉందిగా, విన్పించక పోయినా."

తన ఆశ చావదు. విజ్ఞానంమీద తనకున్న విశ్వాసం నశించదు

ఆనాటినుండి రోజు కొకసారైనా నాన్న హెచ్చరిస్తూంటాడు

ఇంట్లో ఈ మాటలు వినలేక అత్తయ్య గారింటికి పోతుంది. తను అన్నాహారాలు మానటంతో చిక్కి శల్యమై పోయి నా అత్తయ్య తననిచూసి జాలి పడుతుంది.

"నిన్ను ఉసురుపెట్టున్నానమ్మా! ఏచావు చస్తానో గాని."

అత్తయ్య మాటలు తన హృదయాన్ని రంపపుకోత కోస్తయ్

బావ తనకన్న ఆమె కెక్కువ. ఒక్కగానొక్క బిడ్డ. కంటికి కన్పించకుండా పోయాడు ఆనాడు బావను తను బ్రతిమిలాడి నట్లయితే ఈనాడు అత్తయ్యకు పుత్రశోకం ఉండేది కాదుగా.

"నేనే తప్పు చేశాను అత్తయ్యా! నా తప్పుకు శిక్ష నేనేగాక మీరుకూడా అనుభవించాల్సి వస్తున్నది."

అత్తయ్య భోరుమని ఏడుస్తుంది.

తను మనశ్శాంతి పోగొట్టుకోవటం కాక అత్తయ్యక్కూడా లేకుండా చేస్తుంది. కాని తనేం చేస్తుంది మరి?

* * *

"అమ్మాయ్! సంధ్యా! యీ వార్త విన్నావూ?"

వర్తమానం రేవు చేరకముందే సంధ్య తండ్రి కాలప్రవాహంలో పడి కొట్టుకు పోతున్న సంధ్యను రెక్కపట్టుకు ఒడ్డుకు చేర్చాడు.

తండ్రి కేకకు సంధ్య త్రుళ్ళిపడింది

"ఏమిటి నాన్నా?"

సంధ్య ఏడింటికి రేడియోలో విన్న వార్త చెప్పాడు—తండ్రి

"ఆఁ! విన్నాను నాన్నా—" అన్నది సంధ్య చాలా నిరుత్సాహంతో.

ఇంట్లో పని చేస్తుకుంటున్న సంధ్య తల్లి ఒక్కసారి అక్కడికి వచ్చింది—

"ఏమిటి! ఎవరూ వచ్చేది? మన భాస్కరమేనా?"

విహ్వలమూ, విషణ్ణమూ అయిన సంధ్య మొహం చూసేసరికి ఆమె హృదయంలో ఉత్పన్నమైన ఆనంద తరంగాలు అంతలోనే విరిగిపోయినయ్ కళకళలాడుతున్న మొహం కాస్తా కళావిహీనమై పోయింది

"ఆఁ! అవునే మన భా "

భార్య మొహం చూసేసరికి సంధ్యతండ్రి మొహంకూడా విషణ్ణమైంది

సంధ్య దుఃఖం ముంచుకురాగా గదిలోకి పోయి పడుకుంది.

మనసు స్తిమితమయిందికాదు

బావమొహం ఎలా చూడటం?

బావ తనను గురించి ఏమనుకుంటాడు?

సతమతమయి పోతున్నది సంధ్య. కాలు గాలిన పిల్లిలా ఇల్లంతా కలియ తిరుగుతున్నది అత్తయ్యగారింటికి పోదామంటే

అసలే మొహం చెల్లటంలేదు. అసలు అత్తయ్యని చూసే నెలరోజులయింది. ఇవ్వాళ ఏమని వాళ్ళింటికి పోతుంది?

అన్నం సయించిందికాదు

ఆలోచిస్తూనే చిన్న కునుకు తీసింది.

నిద్రలేచేసరికి మూడుగంటలయింది. అత్తయ్య వచ్చిపోయిందిట. అమ్మ చెప్పింది. సాయంత్రం నాలుగింటికి విమానాశ్రయానికి రావటానికి సిద్ధంగా ఉండమని చెప్పి పోయిందిట.

"నేను పోనే అమ్మా!"

"అలా అంటే బాగుండదమ్మా! అత్తయ్య ఏమన్నా అనుకుంటుంది. బావ బాధపడతాడు"

సంధ్యకు ఏడుపు వచ్చింది. అసలు బావకు మొహం చూపించటమే ఎలా అని తను బాధపడుతుంటే, బావ బాధపడుతాడని ఏ మొహం పెట్టుకుని తను విమానాశ్రయం వెళ్తుంది?

అన్నట్లుగా అత్తయ్య నాలుగింటికల్లా వచ్చేసింది. తన బాధంతా చెప్పుకుంది సంధ్య. తనని బ్రతిమిలాడ వద్దన్నది. తనని వదిలి పెట్టమని బ్రతిమలాడుకుంది.

"ఇంటికివస్తే చూస్తాగా?"

మనసులో రాకుండాఉంటే బాగుండును అని ఉన్నది కాని బావని చూడాలని మనసు పీకుతున్నది. ఈ అయిదేళ్ళు ఎందుకని మౌనంగా ఉన్నారో? ఒక్క ఏడాదిలో వస్తానన్న వాళు అయిదేళ్ళు ఎందుకుండాల్సి వచ్చిందో? తెల్సుకోవాలని చాలా ఆదుర్దాగా ఉంది కాని కాని ..

సూర్యాస్తమయమయి సంధ్యాకాంతులు ప్రకాశిస్తున్నయ్.

టాక్సీవచ్చి వాకిట్లో ఆగింది.

సంధ్యగుండె ఆగినంత పనయింది. మామయ్యా-నాన్నా వరండాలో కూర్చున్నారు వంటింట్లో ఉన్న అమ్మ దగ్గఱకు కాబోలు అత్తయ్య లోపలికి పోయింది.

సంధ్య కిటికీ దగ్గఱ నిల్చుని చూస్తున్నది భాస్కరంబావ అడుగుతున్నాడు.

"సంధ్య ఏది మామయ్యా! కన్పించదేం?"

"గదిలో ఉన్నట్లుంది చూడు"

సంధ్యకు అమితమైన భయం కల్గింది. బావ వస్తున్నాడు. ఎలా? ఎలా? తెల్లబడ్డాడు దేహంలో ఏదో ఒకవిధమైన కాంతి కన్పిస్తున్నది మొహం చాలా స్వచ్ఛంగా, సుందరంగా ఉంది; పెదవుల మీద నవ్వు స్నిగ్ధంగా తెల్లగా మెరుస్తున్నది-ఇక్కడినించి వెళ్ళే నాటిలాగా! కాని తనలో-ఈ అయిదేళ్ళు ఎంతో మార్పు తెచ్చినయ్. బుగ్గలు పీక్కుపోయినయ్. మొహంలో మునపటి కాంతి లేదు.

బావ మొహం చూస్తుంటే ఎవరూ తన విషయం చెప్పినట్లులేదు.



బెజవాడకనకదుర్గాలయగోపురం

ఫోటో: ఆర్. సుబ్రహ్మణ్యం, గుంటకల్.

"ఏం సంధ్యా! నామీద కోపంవచ్చిందా అంత నల్లపూసవయి పోయావు"

బావమీద తనకు కోపమా?-ఎనలేని బాధతో కుంచించుకు పోతున్నది గాని.

అంతలోనే ఏదో భావం తళుక్కుమని మెరిసి సంధ్యకు సిగ్గు ముంచుకు వచ్చింది. పమిట చెంగు నిండా కప్పుకుని తలవంచుకు నిల్చున్నది సంధ్య.

"చాలా పెద్దమనిషివయి పోయావే? అవున్లే అది నీ తప్పుకాదు భూమిమీద ఉండటంతో అయిదేళ్ళు పెరిగిపోయావు. కాని నేనుంది చూశావూ పైన ఆకాశంలో తిరుగుతూ ఉండటంతో ఒక్క ఏడాదే పెరిగాను. అబద్ధమను కుంటున్నావా సంధ్యా నే చెప్పేది. ఈ విషయం మాకయినా నూన్కులో దిగేదాకా తెలియదు. ఐన్‌స్టీన్ సాపేక్ష సిద్ధాంతం నిజమేనని ఋజువయింది 'టైమ్స్' అనేది 'యబ్సల్యూట్ టరమ్' కాదని ఇక అందరూ ఒప్పుకోవాల్సిందే ఏమిటీ అలా తలవంచుకు నిల్చున్నావు. సంధ్యా!"

ఆ పిలుపులో అదే మార్దవం—అదే మాధుర్యం. మనసు సుళ్ళు తిరిగిపోయింది.

తరంగితమైన ప్రేమతోనా? తట్టుకోలేని బాధతోనా? సంధ్య తలెత్తి చూసింది.

బావ తనమాట నిలబెట్టుకున్నాడన్న మాట. బావ లెక్క ప్రకారం ఏడాదిలోనే తిరిగి వచ్చాడు! దివినుండి భువికి దిగివచ్చిన దేముడిలాగా కన్పించాడు.

"చీకట్లో ఉన్నావేం? లైటయినా వేసుకోకుండా?"

లైటు వేశాడు భాస్కరం.

పల్చని జార్జెట్ సిల్కులోంచి సంధ్య మెళ్ళోని మంగళసూత్రం తళుక్కు మంది. భాస్కరం కళ్ళు గిరగిరాతిరిగినయ్. కాళ్ళు పట్టుతప్పినయ్. "నన్ను క్షమించు బావా! మొన్ననే పదహారురోజుల పండుగ" అని సంధ్య గబగబా తన గదిలోకి వెళ్ళి తలుపులు బిగించుకుంది. ★